# గళాసెత్తు దెయ్యం

పొద్దుకూకింది. కల్లు పాకలో పొద్దుపొడిచింది. వెలుతురులేదు. చీకటిరాలేదు.

వీధి దీపాలు వెలగ లేదు. గుడ్డి వెలుతురు. మూగ చీకటి.

మూలన రాయి మీద సుబ్బడు. ఎత్తిన గళాసు నోటిక్కరుసుకొనే వున్నాడు. దించలేదు.

సుబ్బడు ఎండు చేప. అయితే కడ్డీ చేప! నీలిగి నడుస్తాడు. నీలిగి కూర్చుంటాడు. నీలిగి పడుకొంటాడు. నీలుగుడు లేందే సుబ్బడు లేడు. సుబ్బడంటే నీలుగుడు.

సారాయి తాగిన సుబ్బడు యువకుడు. తాక్కపోతే ముసిలోడు.

కష్టం మీద ఖాళీ గళాసు నేలమీద పెట్టాడు. చుట్టూ చీకటి పోటెత్తినట్టు ముసిరింది.

సుబ్బడు మూణ్ణాళ్ళ నుంచి కూడు ముట్టిన పాపాన పోలేదు. పోనీ పుణ్యాన పోలేదు. కూడంటే సారాయి.

సారాయి తాగితే తిండి తినడు. డబ్బు వుంటే సారాయి తాగుతాడు. లేకపోతే పస్తు.

సుబ్బడి వంట్లో రక్తం లేదు. సారాయి వుంది. బీడీలు కాలుస్తున్నాడు. కమురు కంపు. మురుకులు, పకోడీలు, బజ్జీలు కూడా కంపు. మసాళా పప్పు, మసాళా బొరుగులు అమ్ముతున్నారు. దగ్గు వస్తుంది. ముడితే ఒట్టు.

సుబ్బడు తాగుతూ తినడు. అమృతం తాగుతూ విషం నంజుకోవటమా? వీల్లేదు.

తాగక ముందు తినటానికుంటే అది పుచ్చుకొని వచ్చి సారాయి కొనుక్కొని తాగుతాడు. సుబ్బడు తాగుతాడు. తినడు. తినటం మర్చిపోయి ఎంత కాలం అయిందో గుర్తులేదు.

పెళ్లాం బ్రతికున్న రోజుల్లో తిన్నట్లు గుర్తు.

పుస్తె అమ్మి తాగిన రోజు తాను చావ వలసింది. ఆమె చావును వలచింది.

అప్పట్నుంచి తింటే సారాయి మానినంత ఒట్టు.

"ఇంకో గళాసు"

సుబ్బడు చెబితే సారాయి కుర్రాడు డబ్బు అడిగాడు.

జేబులో చిల్లర బరువుగా వుంది. తీసి ఇచ్చాడు. కుర్రాడు గళాసులో పోసుకు వచ్చాడు.

'ఈడి కియ్యాలింత డబ్బేణ్ణుంచి వొచ్చుంటుందబ్బా' ఆశ్చర్య పోయాడు, పాపం కుర్రాడు.

నిజమే సుబ్బడికి అమ్మటం తప్ప. సంపాదించటం తెలియదు. ఇల్లమ్మాడు తాగాడు. పొలం అమ్మాడు, తాగాడు. తాళి అమ్మాడు, సరే తాగాడు.

అమ్మటానికి ఏమీ లేకపోతే అప్పు చేశాడు. తాగాడు. కష్టార్జితం తాగాడు.

ముష్టి దొరక్క మూణ్ణాళ్ళ నుంచి కూడు అదే సారాయి ముట్టలేదు.

ఇవాళ ఇంత చిల్లర జేబులో గలగల్లాడిందంటే గళాసు కళ కళ లాడాల్సిందే !!

తిక్క తలకెక్కిన ఒకడు మొలమీద పంచె జారిపోతున్నా నడిచి పోతున్నాడు.

ఒక మూల సన్నగా, శ్రావ్యంగా లల్లాయి పదం అందుకున్నాడు, తాగిన బైరాగి.

'ఎందుకురా యేడుపురేయ్, ఎవరు జచ్చేర్రీడ' సుబ్బడు కసురుకున్నాడు.

'ఏవురది సుబ్బరమన్నేసు సోములోలా దణ్ణాలండీ?' సుబ్బడు మళ్ళీ మాట్లాడలేదు. లల్లాయి పదం ఆగ లేదు. వచ్చే వాళ్ళు వస్తున్నారు, పోయేవాళ్ళు పోతున్నారు.

ఏడుస్తూ వచ్చి నవ్వుతూ, నవ్వుతూ వచ్చి ఏడుస్తూ, ఏడుస్తూ వచ్చి ఇంకా ఏడుస్తూ, నవ్వుతూ వచ్చి ఇంకా నవ్వుతూ, జనం పోతున్నారు.

-6

సుబ్బడు పోలేదు, లేవలేదు, కదల్లేదు. వచ్చినప్పుడు ఎట్లా కూర్చున్నాడో, అట్లాగే కూర్చున్నాడు.

కదలిక అంతా గొంతులోకే! సారాయి దిగుమతి అవుతువుంది.

ఇంత ద్రవ పదార్థం కడుపులోకి దిగుబడి అయినా, వంట్లో తడి లేదు. చెమ్మ లేదు. ఎండిపోయిన కట్టె, వట్టి కట్టె, ఎండు కడ్డీ చేప !

ఏమి అవుతుందీ సారాయి.

ఆ మధ్య దగ్గు వచ్చింది. ఉమ్మి వేస్తే రక్తం వచ్చింది. వంట్లో ఇమళ్ళని ధాన్ని అక్కడెందుకుంచటమని కక్కేశాడు.

ఈ మధ్య దగ్గు రాకుండా రక్తం వస్తూవుంది. గాలి లేకుండా వాన వచ్చి నట్లు. దానికంత సరదా అయితే రానిమ్మని రోడ్లకి గళాసు గళాసులు రక్తదానం చేస్తున్నాడు.

ఎందుకో తెలియదు సుబ్బడి వంట్లోకి రక్తం చేరటానికి ఇష్టపడటం లేదు; ఉన్న రక్తం అక్కడ ఉండటానికి అంగీకరించటం లేదు.

సారాయి కుర్రాడు 'సుబ్బా! ఇంక వెళ్ళేరా!' అంటే 'ఏడిశేవులే పోరా తేరా' అని చిల్లర చేతిలో పెట్టాడు.

"నీకేం పోయే కాలంరా" గళాసు తెచ్చి ముందు పెట్టాడు. గుటకలో మింగి విషం తాగిన పరమ శివుళ్ళా గొంతు పట్టుకున్నాడు.

ఎదుట నిండా ఉన్న గళాసు నోటి దగ్గరుంచుకొంటే తెల్లటి సారాయి రంగు ఎర్రగా మారినట్లు చీకటి కన్ను గీటింది.

సుబ్బడు ఆశ్చర్యంగా గళాసు గొంతు పట్టుకొని, దాని ఊపిరి పీలుస్తు న్నట్లు ఒక్క గుటకలో పూర్తిగా తాగేసి కప్పను మింగిన పాములా కదలకుండా కూర్చున్నాడు.

కల్లుపాక ఎవరికీ కనపడకుండా, కొందరికి కనబడుతూనే ఉంది. చింతల తోపులో దాక్కుంది. కల్లుపాకలో వెలుతురు. కిటికీ మూసిన గదిలో వెలుతురులాగా చిన్నగా, సన్నగా, గుడ్డిగా కనబడుతూ వుంది.

కొక్కెర తెగులు తగిలిన కోడి మెడలాగా మెడ నిగిడ్చి చూస్తున్నాడు సుబ్బడు.

చిల్లర రోడ్డు మీద విరజిమ్ముతున్నారు పిల్లలు. బిచ్చగాళ్లు ఎగబడి ఎగబడి ఏరుకుంటున్నారు.

సుబ్బడు సందు చూచుకొని చొరబడ్డాడు.

హారతి పళ్ళెంలో చిల్లరతో బిగిసిన పిడికిలి గాలిలోకి ఎగరటంతో నేల మీద చిల్లర వర్షిస్తుంది.

ప్రక్కవాణ్ణి తోసి, తన్ని, రక్కి, గిల్లి, సుబ్బడు చిల్లర ఏరుకొన్నాడు. పైస, రెండు, మూడు, అయిదు, పది, పావలా అర్ధ చిల్లరే చిల్లర! బిళ్ళలే బిళ్ళలు! ఏరటం జేబులో చేరటం ఏక కాలం!

ఊపిరి లేని సుబ్బడు అంత ఊపుచూపుతుంటే పక్కనున్న వాళ్ళకి తట్టుకోవటం ప్రాణాపాయంగా అయింది.

పల్లె రోడ్డు దిగి డొంకలోకి మళ్ళితే, వర్షించే పైసలు ఇసుకలో పడి దొరక్క కనబడకుండాపోతే, పళ్ళెం ఖాళీ అయిపోతే, జేబు నిండిపోతే, సుబ్బడు కడుపు నిండినవాడు తేన్చుతూ చుట్టూ చూచినట్టు చూశాడు.

బేండు మేళం వినిపించింది. రోడ్డు పొడుగునా చిల్లరతోపాటు విసిరిన పూలు కనిపించాయి. ఆ రోడ్డున వచ్చిన మనుషులు కనిపించారు. వాళ్ళలో కొందరి ఏడుపు వినిపించింది.

తీరా చూస్తే పల్లకి మోసినట్లు పాడె మోస్తున్నారు. ఎండ తగలకుండా గొడుగు పట్టారు. వల్లకాటికి పోతున్నారు. కాలకుండా దుప్పటి కప్పేపెట్లున్నారు.

సుబ్బడు నవ్వాడు.

చచ్చి ఏ లోకాన ఉన్నాడో కాని ఇన్నాళ్ళకి బతికించాడు అనుకొని శవం ముఖం చూచాడు. తల నున్నగా పూలు రంగు రంగులుగా ముఖం తెల్లగా నల్లగా ఎండకు గొడుక్కు మారుతూ చిత్రంగా కనిపించింది.

వల్లకాటిలో ఈ శవం కాలితే ఈ ముఖం ఈ చిత్రం ఎందుక్కనిపించదు?

కల్లు పాకలో సుబ్బడు నిండా ఉన్న గళాసు నోటి దగ్గర పెట్టుకోగానే రంగు మారింది.

తెల్లగా నల్లగా పూలుగా ఎర్రగా పచ్చగా నున్నగా చిత్రంగా గళాసు నవ్వింది.

నవ్విన గళాసు పీక నులిమేస్తూ గొంతులో పోసేసుకున్నాడు.

గళాసు ఖాళీగా వుంటే శవం లేచి కూర్చుంది. తలనున్నగా నల్లగా తెల్లగా రంగు రంగులుగా ఉంది.

తోటకివతల నుంచి పోతే రోడ్డు. అటు పోతే మురుగు! బురద! రొచ్చు! రోత! ముళ్ళ పొదలు! పిచ్చి చెట్లు!!

చచ్చిన కుక్కను ఈడ్చినట్లున్నారు వాసన. అగరొత్తులు కాలుతున్నాయి.

గళాసులో శవం ప్రాణం తీయటానికి సుబ్బడు సారాయి నింపాడు. శవం చావలేదు. బ్రతికే వుంది. పైగా నవ్వుతూ వుంది దెయ్యం!

తెల్ల దెయ్యం ఎర్రగా మారింది. చిల్లరంతా తీసి కుర్రాడి చేతిలో ఉంచాడు.

పెద్ద లోటా నిండా సారాయి ఇచ్చాడు కుర్రాడు. దానికి రంగూ రుచీ వాసనా అంటూ లేవు.

చిత్రం! సుబ్బడికి చెమట పడుతూ వుంది.

చొక్కా తీయనూ తీశాడు, తుడవనూ తుడిచాడు, ఎక్కడ పెట్టాడో మర్చిపోయాడు.

లోటా నోటకర్చుకొని గుటక గుటకకీ, గాలి కొడితే ఉబ్బే టైర్‌లాగా, కదిలి నిలబడసాగాడు సుబ్బడు. లోటా కాళీ అయ్యేసరికి నిటారుగా నిలబడ్డాడు.

ఎవర్నీ అడక్కుండా వచ్చిన సుబ్బడు, ఎవరికీ చెప్పకుండా బయలు ధేరాడు. కట్టు పంచె అడ్డం పడితే జారతొక్కాడు. ఎట్లా పుట్టాడో, అట్లా పోతున్నాడు.

ఇటు రోడ్డెక్క లేదు. అటు మురుగు తొక్కాడు. ముళ్ళ పొదలు చీల్చాడు. చిన్న ప్రాణాలు దెయ్యమని దాక్కున్నాయి.

తెల్లవారింది.

కాకులూ, గద్దలూ, చిల్లర ఏరుకొంటున్న వాళ్ళు లాగా అరుస్తున్నాయి, కరుస్తున్నాయి. ఎగురుతున్నాయి.